

# ఒక దెయ్యంతో నా ప్రేమకథ



– డా.యండమూరి వీరేంద్రనాథ్

అంకితం

అపరాధ పరిశోధన (డిటెక్టివ్) నవలని తెలుగు పాఠక లోకానికి పాపులర్ చెయ్యటంలో ఆద్యుడు

**కొమ్మూరి సాంబశివరావు కి**

\- రచయిత

## కృతజ్ఞతలు:

దెయ్యం తపున ఒక లాయరు కేసు టేకప్ చేసిన కథాంశం తో నవల వ్రాయమని సూచన ఇచ్చిన ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ, మానసిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఇండ్ల విశాల్, రాగమాలికల వివరణ చెప్పిన గొర్తి బ్రహ్మానందం, పురాణ, ఇతిహాసాసాల గురించి వివరించిన బాలాంత్రపు రమణ, ఇంటరాగేషన్ విధానాల గురించి వివరించిన రిటైర్డ్ ఐ.పి.యస్ ఆఫీసర్ శ్రీరావులపాటి సీతారామారావు, లీగల్ సమాచారం అందజేసిన లాయర్ గోపాల్ సింగ్, ఫేస్–బుక్ గురించి వివిధ వివరాలు చెప్పిన వి.వి.ఆర్.కిషన్, ఎ.ఐ. ఇన్ఫర్మేషన్ ఇచ్చిన అల్లాణి శ్రీధర్,

కలీమా, జకాత్ ల గురించి చెప్పిన ఖాదిర్ బాబు,ఎందఱో మహానుభావులు. అందరికీ కృతజ్ఞతలు.

...

ఇదో చందమామ కథ. ఆస్తిక–నాస్తిక–దెయ్యాల చర్చ వద్దు.

**- యండమూరి**

# (గతసంచిక తరువాయి)

8

**కోర్టులో ముద్దు పెట్టుకోవటం** బాగోదనుకున్నాడో ఏమో, ఆఫీసుకి వెళ్ళగానే "అద్భుతం లాయరుగారూ. అద్భుతం" అంటూ శ్యామ్‌లాల్ నన్ను బలంగా దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు. దురుద్దేశం లేని, అధర చుంబనం కాదు కాబట్టి రుమాల్తో బుగ్గ తుడుచుకుని "థ్యాంక్స్" అన్నాను.

"సస్పెన్సుతో చచ్చిపోతున్నాను లాయరుగారూ. డి.యస్పీగారి సెకండ్ సెటప్ సంగతి మీకెలా తెలిసింది? ఆవిడ లాకర్‌లో నా కూతురి బ్రేస్‌లెట్ ఉన్నట్టు ఎప్పుడు ఎంక్వయిరీ చేశారు?"

చెవి పక్క నుంచి "దెయ్యం చెప్పిందని చెప్పు. పిచ్చాసుపత్రిలో చేర్పించరనే ధైర్యం ఉంటే..." అని వినపడింది.

"నోర్ముయ్యి" అన్నాను.

శ్యామ్‌లాల్ బిక్కమొహం పెట్టి "ఎందుకు సార్ అలా తిడుతున్నారు?" అన్నాడు.

కంగారు పడి, "సారీ సర్. మిమ్మల్ని కాదు. 'నోర్మూసుకో' అని నన్ను నేనే తిట్టుకుంటున్నాను" అన్నాను.

అతడింకా అనుమానం తీరాక "వరూధినికి దైవభక్తి ఎక్కువ అనీ, కోర్టులో అబద్ధం చెప్పదనీ మీకెలా తెలిసింది? వారి ఇంటికి కోయవాడు వెళ్ళినట్టు మీకు ఎవరు చెప్పారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

"సెకండ్ సెటప్ ఉన్నవారికి దైవభక్తీ, పాపభీతీ ఎక్కువ ఉంటుంది. ఇక కోయవాడి సంగతి అంటారా? అసలా కోయవాడు ఒకడు ఉన్నాడనీ, వాడు ఆమె ఇంటికి వెళ్ళాడనీ ఈ శ్రీనివాసరావుకి తెలీదు కదా. గాలిలో బాణం వేశాను" అన్నాను.

"గ్రేట్... గ్రేట్... ఒక్క నిముషం లాయరుగారూ" అంటూ మళ్ళీ ముద్దుపెట్టుకోబోయి ఆపుకుని, లోపలికి వెళ్ళి చెక్కు తీసుకొచ్చి చేతిలో పెట్టాడు. అతడు అంత తొందరగా ఫీజు ఇస్తాడనుకోలేదు. చూస్తే, నేను ఊహించిన దానికన్నా మూడు రెట్లు ఉంది. హృదయమూ, చెయ్యీ మనస్ఫూర్తిగా కలిపి "థ్యాంక్స్" చెప్పి బయటకి వచ్చి కారు ఎక్కాను.

స్పీకర్ నుంచి "లగ్ జా గలే సే... ఫిర్ ఎ హసీ రాత్" అని 'ఓ–కౌన్–థీ' లో పాట వస్తోంది. 'మత్తయిన ఇలాంటి రాత్రి మళ్ళీ వస్తుందో లేదో... మెత్తగా కౌగిలించుకో' అని హీరోయిన్ దెయ్యం హీరోని అడుగుతోంది. దెయ్యాలు *రాగ్–పహాడీ*లో పాటలు పాడతాయా అని అనుమానించకుండా పాటని ఆస్వాదిస్తూ ఉండగా "మరి నా ఫీజు?" అని గాలిలో వినిపించింది. చెవి పక్క నుంచి అకస్మాత్తుగా వినపడిన ఆ శబ్దానికి అదిరిపడి బ్రేక్ వెయ్యబోయి అతికష్టం మీద తమాయించుకుని–

"ఎవడ్రా నువ్వు? మళ్ళీ ఆ ప్రభాకర్‌గాడి దెయ్యానివేనా" చిరాగ్గా అడిగాను.

"ఇంత సహాయం చేస్తే, అంత అగౌరవంగా మాట్లాడుతావా? మా దెయ్యాలని చూసైనా సంస్కారం నేర్చుకో".

"దెయ్యమయ్యాక నీతులు చెప్పటం కాదు" అన్నాను.

సమాధానం లేదు. 'హలో' అన్నాను. అలికిడి లేదు. అకస్మాత్తుగా ఆ స్వరం మాయమవటానికి కారణం అర్థం కాక, '....ప్రభాకర్... ప్రభాకర్...' అన్నాను. అట్నుంచి సమాధానం లేదు.

కారు ఆంజనేయ స్వామి గుడి దాటుతూండగా విషయం అర్థమయింది..!

కొంచెం ముందుకి వెళ్ళగానే మళ్లీ "హలో" అని వినిపించింది.

"గుడి కనబడగానే అలజడి పడి మాయమయ్యావా?" హేళనగా అన్నాను.

"మాయం అవలేదు బ్రో. నేను వెళ్ళింది ఆ గుళ్లోకే..! హనుమంతుడు మా ఆరాధ్య దైవం. వెళ్లి నమస్కారం చేసి వచ్చాను. క్రాస్ కనపడగానే భయపడటానికి నేనేమీ దెయ్యాల సినిమాల్లో సైతాన్ని కాను. భక్తి గౌరవాలు ఉన్న భారతీయ దెయ్యాన్ని" అన్నాడు.

"నేన్నీకు తెలుసా? మనం భూమ్మీద ఎప్పుడైనా కలిశామా?" మాట మార్చాను.

"నేనోసారి నిన్ను ఇంటర్వ్యూ చేశాను. నాక్కాబోయే భార్యతో కలిసి వచ్చాను. ఆమె వ్రాసిన పద్యం చదివి తిట్టావు కూడా" అని ఓ క్షణం ఆగి, "...ఆ రోజు ఇంటర్వ్యూలో దేవుడూ-దెయ్యం ఏవీఁ లేవన్నావు. ఉన్నాయని ఇపుడు నిరూపణ అయింది కదా" అన్నాడు.

ఒప్పుకోవటం ఇష్టం లేక, "సరే విషయం చెప్పు" అన్నాను విసుగ్గా.

"నువ్వు నాకు ఒక సహాయం చేయాలి".

మొహం చిట్లించాను. "ఏమిటది?"

"నా బావమరిది అడవుల్లో ఉన్నాడు. వాడిని రక్షించి వెనక్కి తీసుకురావాలి".

ఒళ్ళు మండింది. "అడవుల్లో తప్పిపోయినోళ్ళను తీసుకురావడానికి నేనేమీ గ్రేహౌండ్ కుక్కను కాను. అయినా నీకు ఏదైనా సహాయం కావలసి వస్తే పోయి ఎవరినైనా పోలీసుని ఆవహించి పట్టుకో. లేదంటే నీక్కాబోయే భార్య టి.వి. యాంకరు అన్నావుగా. ఆవిడని ప్రయత్నించమను".

"ఆవిడ లేదు. నీవు తప్ప నాకీ సాయం ఇంకెవరూ చేయలేరు".

"ఇది నా పని కాదు. నేను లాయర్‌ని" చిరాగ్గా అన్నాను.

"కానీ ఈ పని చేయడానికి లాయర్ కాదు. తెలివైనవాడు కావాలి."

నాకు ఒళ్ళు మండిపోయింది. "ఏమిటి నీ ఉద్దేశం? లాయర్లు తెలివైనవాళ్ళు కాదనా? ఇప్పుడు నువ్వు అన్న ఈ మాటకి కనీసం పది కోట్లకి తక్కువ కాకుండా పరువు నష్టం దావా వెయ్యొచ్చు".

"వెయ్యొచ్చు. కానీ నీకు నా అడ్రస్ తెలియదే".

గతుక్కుమని, తమాయించుకుంటూ "సరే. విషయం చెప్పు. అయినా నాకు ఒక అనుమానం. ఈ ప్రపంచంలో తెలివైనవాళ్ళు బోల్డుమంది ఉన్నారు కదా. నన్నే ఎందుకు ఎన్నుకున్నావ్?"

"నా మాటలు నీకు తప్ప మరెవరికీ వినపడవు కాబట్టి".

ఆశ్చర్యంగా "అదేమిటి?" అన్నాను.

"నేను యమలోకంలోకి ప్రవేశిస్తున్నప్పుడు మన భుజాలు కొట్టుకున్నాయి గుర్తుందా. తిట్టుకున్నాం కూడా..."

"అవును. నన్ను ఎడమ వైపు నడవమన్నావు. ఆకాశంలో కుడి ఎడమలు ఉండవన్నాను".

"గుర్తున్నది కదా. అలా మాట్లాడుకున్నాం కాబట్టి, నువ్వు భూమ్మీదకి వచ్చిన తర్వాత కూడా నా మాటలు నీకు వినిపిస్తున్నాయి. మరోలా చెప్పాలంటే... నేను నీతో తప్ప మరెవరితోనూ కమ్యూనికేట్ చేయలేను".

ఇదేదో గమ్మత్తుగా అనిపించింది కానీ, సమయం వృథా అనిపించింది.

"విషయం తెలిసింది కాబట్టి నేను కూడా నా విషయం చెబుతాను విను" అన్నాను. "...ఈ అడవుల్లో వెతకటాలు, బాత్రూంలో మాట్లాడటాలూ నా కప్–ఆఫ్–టీ కాదు. నేను మెటీరియలిస్టుని. లాభం లేకుండా ఏ పనీ చెయ్యను".

"లాభం ఎందుకు లేదు? శ్యామలాల్‌కి నేను సహాయం చేశాను కదా. అతడు నీకు ఎంత ఫీజ్ ఇచ్చాడో ఆ చెక్కు కూడా చూశాను. అంత డబ్బు ఇస్తాడని నువ్వు ఊహించలేదు కదా".

"ఓహో. ఇలాంటి పత్తేదారు పనులు కూడా చేస్తున్నావన్నమాట. ఇంకా ఏదో మంచి మనసుతో చేశావనుకున్నాను."

"దెయ్యాలు ఏ పని చేసినా మంచి మనసుతోనే చేస్తాయి. స్వార్థంతో పని చేసేది మనుషులే...".

"అడవిలో ఉన్న బామ్మరిదిని వెనక్కి తీసుకు రమ్మని కోరటం కూడా మెటీరియలిస్టిక్ స్వార్థమే" వ్యంగ్యంగా అన్నాను. దెయ్యం మాట్లాడలేదు.

"...మరో విషయం. నాకు ఇంకా పెళ్లి కాలేదు. నా బెడ్ రూమ్ లో రాత్రిళ్ళు అటక మీద కూర్చుని చూడకు. నీ మంచి కోసం చెపుతున్నాను".

అట్నుంచి సమాధానం లేదు. ‘హలో…’ అన్నాను. జవాబు లేదు. మళ్ళీ ఏదైనా గుడి వచ్చిందేమో అని అటూ ఇటూ చూశాను. అటువంటిది ఏమీ లేదు. గట్టిగా “ప్రభాకర్…” అన్నాను. సమాధానం లేదు. దెయ్యం వెళ్ళిపోయిందన్న మాట.

‘హమ్మయ్య. దెయ్యం వదిలింది’ అనుకున్నాను.

అంత తొందరగా వదలదని తరువాత తెలిసింది.

– 9 –

“లాయర్‌గారూ. మీరు ఎంతో పేరున్నవారు. ఒక సలహా కోసం మీ దగ్గరకి వచ్చాం” అన్నాడాయన. ఎక్కడో చూసినట్టు ఉంది. వయసు యాభై పైనే ఉంటుంది. పక్కనే ఓ అమ్మాయి కూర్చుని ఉంది. కూతురు అనుకుంటాను.

“ముందే చెపుతున్నాను. నేనొక స్కూల్ మాస్టార్‌ని” అన్నాడాయన. “…మీక్కాదు కదా. మీ అసిస్టెంటుకి కూడా ఫీజు ఇచ్చుకోలేను”.

ఆయన వైపు ఇబ్బందిగా చూశాను. చూడగానే గౌరవభావం కలిగేలా ఉన్నాడు. బీదవారంటే నాకు జాలి ఉన్నది గానీ, దానికన్నా ఖరీదైన నా సమయానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉన్నది.

రామకృష్ణ నా ఇబ్బంది గమనించి, “కొన్ని కేసులకి ప్రభుత్వమే ఉచితంగా లాయర్‌ని ఇస్తుంది. రండి. కేసు వివరాలు నాకు చెపుదురు గాని” అన్నాడు.

“మేము కేసు గురించి రాలేదు బాబూ. సలహా కోసం వచ్చాము” అన్నాడు.

నాకు విసుగేసింది. సలహా అంటే ఏముంటుంది? పక్కనే కూతురు ఉంది. ఆమె ఎవర్నో ప్రేమించి ఉంటుంది. కౌన్సిలింగ్ చేసి ఆ ఇద్దరినీ విడగొట్టమంటాడు. నూటికి తొంభై కేసులు అవేగా..! మొన్న కలిసిన సైకాలజిస్టుని రికమండ్ చేద్దామని అనుకున్నాను కానీ, అతడు ఆమె ప్రేమకి ‘*మేనియాక్ అష్టోసోఫియా మల్టిపుల్ డేటింగ్ సిండ్రోమ్*’ అని ఏదో పేరు పెట్టి, పెద్దాయన దగ్గర పెద్ద ఫీజు తీసుకుంటాడని భయమేసింది.

ఆ తటపటాయింపు చూసి రామకృష్ణ, “మేము కేవలం కోర్టులో కేసులు వాదించే లాయర్లమండీ. సలహాలు ఇచ్చే కౌన్సిలర్సు వేరే ఉంటారు” అన్నాడు.

ఆ విషయం తెలుసన్నట్టు తలూపి, నా వైపు తిరిగి, “ఆనంద్ బాబూ. మీ తండ్రిగారు నాకు బాగా తెలుసు. నువ్వు మర్చిపోయి ఉంటావు. రెండో క్లాసులో నీకు లెక్కల పాఠాలు చెప్పింది నేనే” అన్నారు జ్ఞాపకశక్తిపై నాకున్న అహాన్ని దెబ్బ తీస్తూ.

చప్పున కుర్చీ లోంచి లేచి “సారీ మాస్టారూ. గుర్తు పట్టలేదు” నొచ్చుకుంటున్నట్టు అన్నాను. ఆయన పేరు కృష్ణారావు మాస్టారని గుర్తొచ్చింది.

“పర్లేదు బాబూ. చాలా సంవత్సరాలు అయింది కదా”

“...చెప్పండి. నేను మీకేం సాయం చేయగలను?”

“ఈ అమ్మాయి నా కూతురు త్రినేత్రి” అన్నాడు. అప్పుడు చూశాను ఆమె వైపు పరిశీలనగా. నాలాగే పెద్ద అందంగా లేదు కానీ కళ్ళలో ఏదో తీక్షణత... ఏమంటారో తెలీని సీరియస్‌నెస్ ఉంది.

వెంటనే సబ్జెక్టులోకి వెళ్ళటం ఇష్టంలేక, “అమ్మాయి ఏం చేస్తూ ఉంటుంది?” అని అడిగాను.

“గుళ్ళో భజనలు చేస్తూ ఉంటుంది బాబూ” అన్నాడు. ఆయనలా చెప్పగానే ఆ అమ్మాయి కళ్ళు పైకెత్తి ఒకసారి చూసి, తిరిగి దించుకుంది. ఆమె వృత్తి అదేనేమో అనుకుని, “గుళ్ళో భజనలు చేసినందుకు డబ్బులు ఇస్తారా?” అని అడిగాను.

“ప్రతి పనీ మనుష్యులు డబ్బుల కోసమే చెయ్యరు” అన్నది కొట్టినట్టుగా.

బులెట్‌లా వచ్చిన ఆ సమాధానం ఎక్కడో చెప్పుకోలేని చోట తగిలి గతుక్కుమన్నాను. ‘త్రినేత్రి’ పేరు కరెక్టుగా పెట్టారనుకున్నా. మాట మారుస్తూ “ఏమి చదువుకున్నారు మీరు?” అని అడిగాను.

“ఎమ్మే సైకాలజీ” అన్నది. అప్పుడు కాస్త తీరిగ్గా చూశాను. చదువుకున్న దానిలా కనపడటం లేదు. గుళ్ళో భజనతో పరిచయం ప్రారంభమయింది కాబట్టి ఆమె పై తొలి అభిప్రాయం ఆ విధంగా ఏర్పడి ఉండొచ్చు. కొత్తగా పెళ్ళయిన ఓ అమ్మాయి. తన అనుభవం గురించి ‘కోరా’లో వ్రాస్తూ, ‘ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్ అండ్ వరస్ట్ రియాల్టీ’ అన్నది. ఎంత గొప్ప నిజం..!

నేను ఈ విధంగా ఆలోచిస్తూ ఉండగా, “మా అమ్మాయి స్కూల్లో టీచరు. పదో పరకో ఇస్తారు. రచనలు కూడా చేస్తూ ఉంటుంది బాబూ” అన్నాడు.

‘ఓహో. ఈ విద్య కూడా ఉన్నదా’ అనుకుంటూ, “సర్లే చెప్పండి. నేనేం చెయ్యగలను?” అని అడిగాను.

“మొన్న రాత్రి గుడి దగ్గర మా అమ్మాయిని ఎవరో ఇద్దరు రేప్ చేశారు” అన్నాడు.

అరడుగు దూరంలో అగ్నిపర్వతం బ్రద్దలైనట్టు నేనూ, రామకృష్ణ అదిరిపడ్డాము.

ఈ విషయం ఇంత క్యాజువల్‌గా చెపుతున్నాడేమిటా అనుకోలేదు. బొంగురుపోయిన ఆయన గొంతులో రాత్రంతా పడిన బాధ కనపడుతూ ఉంది.

"నిన్నంతా మా ఇంట్లో గొడవ బాబూ. నేనేమో 'అయిందేదో అయింది. జరిగింది మర్చిపో...' అంటాను. ఎలాగైనా పోలీసు రిపోర్ట్ ఇవ్వాలంటుంది నా కూతురు. మీరే చెప్పండి. పెళ్లి కావలసిన పిల్ల. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. ఆ దుర్మార్గులు ఎవరో, ఎక్కడ ఉంటారో తెలీదు. వాళ్ళని వెతికే క్రమంలో పోలీసులు మా ఇంటికి లక్షసార్లు వస్తారు. చుట్టు పక్కల తెలుస్తుంది. పైకి సానుభూతి చూపిస్తూ లోలోపల నవ్వుకుంటారు. చివరకు ఆ దుర్మార్గులు దొరికినా, మీడియా వాళ్లకి పండగే తప్ప సాధించేదేమీ ఉండదు. ఇంత వివరించి చెప్పినా అర్థం చేసుకోదేం?" అన్నాడు.

ఆయన మాటలు ఇంకా పూర్తి కాకుండా నేను ఒక్క ఉదుటున కుర్చీ వెనక్కి తోసి, "ఆపండీ" అంటూ ఆవేశంగా లేచి, "ఏం మాట్లాడుతున్నారండీ మీరు? మీలాంటి వారి వల్లే ఈ దేశంలో కామాంధులు కాట్ల కుక్కల్లా రెచ్చి పోతున్నారు..! ఒక అన్యాయం జరిగితే దాన్ని నొక్కి పెడతారా? రేపటి మీ కూతురి భవిష్యత్తు కోసం, నేటి భారతదేశపు వర్తమానాన్ని బలి పెడతారా? వద్దండీ. తండ్రిగా కాదు. ఒక పౌరుడిగా మీరు మీ పవిత్ర బాధ్యత నెరవేర్చక తప్పదు" అన్లేదు.

కూతురి వైపూ, ఆమె తండ్రి వైపూ సాలోచనగా చూసి, "మీరు చెప్పింది నిజమే మాష్టారూ" అన్నాను.

గాఢనిద్ర లోంచి, వీపు మీద ఏదో చురుక్కుమని మెలకువ వచ్చి, పక్క మీద కనపడిన నల్లిని ఎంత కసితో చంపుతామో, ఆ అమ్మాయి నన్ను అలా చూసింది. ఆ చూపులో కోపం కన్నా అసహ్యం ఎక్కువ కనపడి నా లేత మనసు బాధ పడింది.

వాస్తవ ప్రపంచంపై సరైన అవగాహన లేని ఆ అమాయక స్త్రీ ఆలోచనా విధానాన్ని, నా వ్యక్తిత్వ వికాస కౌన్సిలింగు ద్వారా మారుద్దామన్న ఉద్దేశ్యంతో, "మేడమ్. మీరు పోలీసు రిపోర్టు ఇస్తే, వాళ్ళు చాలా ఇబ్బందికరమైన ప్రశ్నలు వేస్తారు. ఆస్పత్రికి పంపుతారు. అక్కడ కంపల్సరీగా లేడీ డాక్టరే ఉండవనసరం లేదు. రకరకాల పరీక్షలు చేస్తారు" భయపెడుతున్నట్టు అన్నాను.

చివరి వాక్యం చెప్పటానికి కాస్త ఇబ్బంది పడ్డాను కానీ, ఆవిడ అలాంటి ఇబ్బందేమీ లేకుండా, "అవును వజీనా టెస్టులూ, సెమన్ అండ్ స్పెర్మ్ పరీక్షలూ... అన్నీ చేస్తారు" అంది.

ఆమె అజ్ఞానానికి నవ్వుకుని, "సెమెన్ అన్నా, స్పెర్మ్ అన్నా ఒకటే మేడమ్" అంటూ సరిదిద్దాను.

"కాదు. స్పెర్మ్‌ని లోపలికి తీసుకెళ్ళే లిక్విడ్‌ని సెమెన్ అంటారు" అంది.

మొగవాడిని. నాకే ఆ రెంటికీ తేడా ఇంత వరకూ తెలీదు. మాటిమాటికీ గతుక్కుమంటే బావోదని "అదే... అదే... ఇంకా ఇంకా చాలా టెస్టులూ వగైరా చేస్తారు" అన్నాను.

"అవును. వర్జినిటీ, ఫోరెన్సిక్ ఐడెంటిఫికేషన్లూ, డి.ఎన్.ఎ. ప్రొఫైలింగ్... అలా చాలా చేస్తారు. గత అనుభవాలు ఏ(వైనా ఉన్నాయా అని కూడా అడుగుతారు" అంది.

నేననుకున్న దానికన్నా ఈ అమ్మాయికి, సమరంగారి పుస్తకాలు చదవటం వలన 'లోతైన' పరిజ్ఞానం ఉన్నదే అనుకుంటూ, "రేప్ ఎప్పుడు జరిగింది?" అని అడిగాను.

"మొన్న రాత్రి పదింటికి బాబూ" అన్నాడాయన.

"ఆ ఇద్దరూ ఎవరో తెలుసా?"

తండ్రి ఏదో చెప్పబోతూ ఉంటే ఆమె కల్పించుకుని, "కారు చూశాను. నల్ల బెంజి కారు." అంటూ చెప్పటం ప్రారంభించింది. ఆమె చెప్పినదంతా క్రోడీకరిస్తే... 'ఊరికి చాలా దూరంగా విసిరేసినట్టూ ఉంటుంది గుడి. రాత్రి పదింటి వరకూ అక్కడ భజనలు చేసి, భక్తులందరూ వెళ్ళిపోయాక అన్నీ సర్దుకుని ద్విచక్ర వాహనం మీద ఊరి వైపు వస్తూంటే, వెనుక నుంచి వచ్చిన ఒక పెద్ద కారు ఆమె వాహనాన్ని ఓవర్-టేక్ చేసి ఆగింది. కార్లోంచి ఇద్దరు వ్యక్తులు దిగి ఆమెని బలవంతంగా పక్క పొలంలోకి తీసుకు వెళ్ళారు.

"మీరు అరవలేదా?" అని అడిగాను.

"ఎందుకు? జనం వచ్చి వీడియో తీసుకోవటానికా?" అంది.

ఆమెలో ఎక్కడో ఏదో తేడా ఉందనిపించింది. జాలిగా చూశాను. ఆమె కూడా నా వైపు అలాగే చూసి, "మొన్న భూపాల్ రైల్వేస్టేషన్ ముందు ఎవడో బిచ్చగత్తెని రేప్ చేస్తూంటే చుట్టూ చేరి జనాలు చేసింది అదేగా" అన్నది.

ఏం సమాధానం చెప్పాలో తెలియక, "మీరు వాళ్ళని చూస్తే గుర్తు పట్టగలరా?" అన్నాను.

"దీనికి పది రోజుల ముందు కార్తీక పౌర్ణమి రోజున అదే బెంజి కారులో వాళ్ళు గుడికి వచ్చినట్లు గుర్తు. బహుశా అప్పుడే వాళ్లకీ ఆలోచన వచ్చి ఉంటుంది. వాళ్ళని చూస్తే గుర్తు పట్టగలనని అనుకుంటున్నాను".

"పోలీసులు వాళ్ళని తీసుకొచ్చి చూపిస్తే, మీరు గుర్తు పట్టగలరు. అంతేగా".

ఆమె సమాధానం చెప్పలేదు.

"మన ఊళ్ళో దాదాపు నలభై యాభై నల్ల బెంజి కార్లుంటాయి. పోలీసులు వాళ్ళందర్నీ పిలిచి మీ ముందు పెరేడ్ చేయించరు" అన్నాను.

అవునన్నట్టు ఆమె తండ్రి నా వైపు చూశాడు. దాంతో మరి కాస్త ఉత్సాహం వచ్చి, "ఒకవేళ పోలీసులు దోషుల్ని పట్టుకున్నా, మీరు ఇష్టంతోనే వచ్చారనీ, ఆ తర్వాత డబ్బుల కోసం బ్లాక్-మెయిల్ చేస్తున్నారని మీ మీదే ఎదురు కేసు పెడతారు" అని ఇంకా ఏదో వివరించబోతూ ఉంటే, ఆమె నన్నో మలేరియా దోమని చూసినట్టు చూసి, కుర్చీలోంచి చివాలున లేచి, తండ్రితో "పద పోదాం" అని, ఓ క్షణం ఆగి, "నువ్వు వస్తేరా. లేకపోతే నే వెళ్తున్నాను" అంటూ అక్కడి నుంచి విసవిసా వెళ్ళి పోయింది.

ఈ హఠాత్ సంఘటనకి ఆమె తండ్రి కూడా బిత్తరపోయినట్టు కొంచెం సేపు మాట రాక ,ఆ పై నెమ్మదిగా "మా అమ్మాయి అంతే బాబూ. తాను చెప్పిందే వేదం. ఎలా మార్చాలో అర్థం కావట్లేదు" అన్నాడు.

"పర్లేదండీ. దాన్ని కాగ్నిటివ్ బయాస్ విత్ సెల్ఫ్ అటెన్షన్ డెఫిసిట్ డిజార్డర్ అంటారు" అని నా లేటెస్ట్ పరిజ్ఞానంతో చెప్పబోయి, అసలే కష్టాల్లో ఉన్నాయన మరింత భయపడతాడని ఊరుకున్నాను.

"...నువ్వు చాలా పెద్ద లాయరువని తెలుసు. ఎప్పుడో పాఠం చెప్పిన పుణ్యానికి మా కోసం ఇంత టైమ్ కేటాయించావు. ఎంతో సాదరంగా మాట్లాడావు. అదే చాలు బాబూ" అంటూ లేచి, "మీకు ఇద్దామని ఈ పుస్తకాలు తెచ్చాము. అంతా రసాభాస చేసింది" అంటూ రెండు డైరీల్లాంటి పుస్తకాలు ఇచ్చి వెళ్ళిపోయారు.

కవర్ పేజీ మీద 'త్రినేత్రి అని ఉంది. 'ఓహో. ఇప్పుడు వీటిని చదవాలా' అనుకుంటూ పక్కన పడేశాను. ఆ పుస్తకాలే నా జీవిత గమ్యాన్ని మారుస్తాయని ఆ క్షణం నేను ఊహించ లేదు.

## (కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments